క్లుప్తంగా

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే శంబంగి


ఎమ్మెల్యే శంబంగిని ఆప్యాయంగా పలకరిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

బొబ్బిలి: కంటకాపల్లి రైలు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలతో పాటు గాయపడిన వారిని పరామర్శించేందుకు జిల్లా కేంద్రానికి సోమవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం కూడా ఆప్యాయంగా పలకరించి, బొబ్బిలి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

ప్రాంతీయ ఆస్పత్రి ఏవోగా చంద్రశేఖర్



రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వం ప్రాంతీయ ఆస్పత్రి ఏవో(అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా కె.చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సీతంపేట ప్రభుత్వాస్పత్రిలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి, పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

కుచించుకుపోయిన ఏకేఎల్ గెడ్డ


వెంకంపేట వద్ద గెడ్డ పరిస్థితి ఇలా..

రేగిడి: మండలంలోని ఉనుకూరు–కొత్తచెలికావలస గ్రామాల మధ్య వెంకంపేట దగ్గర ఉన్న ఏకేఎల్ గెడ్డ కుచించుకుపోవడంతో సాగునీరు సక్రమంగా ప్రవహించడం లేదు. దీంతో గెడ్డ నీటిపై ఆధారపడి వ్యవసాయం చేసే రైతులంతా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వర్షాలు కురవకముందే గెడ్డను బాగు చేయాలని, లేకపోతే గెడ్డకు గండిపడి పొలాల్లోకి వరదనీరు చేరి, పంటలు నష్టపోయే అవకాశం ఉందన్నారు. సాగునీరు సక్రమంగా పొలాలకు అందేలా గెడ్డను బాగుచేయాలని కోరుతున్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు


సీసీ డ్రైనేజీ నిర్మాణానికి మట్టితవ్వకాలు చేస్తున్న కూలీలు

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో అభివృద్ధి పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామంలోని రజక వీధిలో సీసీ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నారు. రూ.3 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఈ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు సర్పంచ్ నక్క తవిటమ్మ, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి తెలిపారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

రేగిడి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈవో బి.ఎరకయ్య ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని సంకిలి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన తొలుత పాఠశాల రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం వివిధ ప్రశ్నలు అడిగి, విద్యార్థుల విద్యాసామర్థ్యాలను అంచనా వేశారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్యాబోధన చేయాలని తెలిపారు. జగనన్న గోరుముద్ద పథకం కింద పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనం రుచి, శుచి కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

శరవేగంగా రోడ్డు నిర్మాణం


ఎం.గదబవలస–తెర్లాం బీటీ రోడ్డు పనులు

తెర్లాం: మెరకముడిదాం, తెర్లాం మండలాల్లోని పలు గ్రామాలను కలిపే బీటీ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మెరకముడిదాం మండలంలో సాతాంవలస–పెరుమాళి, ఎం.గదబవలస–తెర్లాం జంక్షన్ వరకు ఉన్న మట్టిరోడ్డును తారురోడ్డుగా నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రస్తుతం సాతాంవలస నుంచి పెరుమాళి వరకు ఇప్పటికే బీటీ రోడ్డు నిర్మాణం పూర్తికాగా, ప్రస్తుతం ఎం.గదబవలస నుంచి తెర్లాం జంక్షన్ వరకు బీటీ రోడ్డు పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఆయా గ్రామాల మధ్య సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణానికి నానా అవస్థలు పడేవారు. ప్రభుత్వం ఇప్పుడు రోడ్డు నిర్మించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


రేగిడి: ఉనుకూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మందుల కిట్లు అందజేస్తున్న డాక్టర్ రాజేష్, వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్మోహనరావు


సంతకవిటి: మందరాడలో రోగులకు మందుల కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

ఊరిలోనే వైద్యం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఆరోగ్య భరోసానిస్తోంది. గ్రామగ్రామాన ఏర్పాటైన వైద్యశిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. సోమవారం శిబిరాలకు వచ్చిన రోగులకు వైద్యారోగ్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు నిర్వహించి, మెరుగైన వైద్యసేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని, సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, ఊరూరా అందుబాటులోని ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు కోరారు. ఉన్న ఊరిలోనే ఉచితంగా వైద్యం అందుతుండడంతో ప్రజలు సంతోషంగా వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్


రాజాం: గార్రాజుచీపురుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో జెడ్పీటీసీ నర్సింహులు, వైఎస్సార్ సీపీ నేత రాజగోపాలనాయుడు

రైతాంగానికి ప్రభుత్వం వెన్నుదన్ను

- జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: రైతాంగానికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు అన్నారు. సోమవారం మండలంలోని మందరాడ గ్రామంలో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ హయంలో రైతులు విత్తనాలు కావాలంటే మండల కేంద్రాలకో, వ్యవసాయ మార్కెట్ కమిటీలకో ముందురోజు రాత్రి వెళ్లి, వరుసలో నిలబడేవారని, తీరా తన దగ్గరకి వచ్చేసరికి విత్తనాలు దొరుకుతాయో లేదో అన్న పరిస్థితి ఉండేదని, ఇప్పుడు అలా లేదన్నారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన కావాల్సిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులతో పాటు, పశువుల దాణా, పశువులకు కావాల్సిన మందులన్నీ దొరుకుతున్నాయన్నారు. రైతులు ఆర్‌బీకేలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వి.శ్రీనివాసనాయుడు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, ఎంపీడీవో రవికుమార్, మండల వ్యవసాయాధికారి పైల నవీన్ పాల్గొన్నారు.

మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలి


మరుగుదొడ్లను శుభ్రం చేసే మెటీరియల్‌ను స్కావెంజర్స్‌కి అందజేస్తున్న ఎంఈవో త్రినాథరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠశాలల స్కావెంజర్స్‌తో సమావేశమైన ఆయన మరుగుదొడ్లను శుభ్రం చేసే మెటీరియల్‌ను వారికి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల తనిఖీ సమయంలో మరుగుదొడ్లను పరిశీలిస్తానని, ఏ పాఠశాలలోనైనా మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తిస్తే సంబంధిత స్కావెంజర్స్‌ని విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 పాపారావు, తెర్లాం హైస్కూల్ హెచ్‌ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 3న ప్రత్యేక స్పందన


మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: మండల కేంద్రంలో నవంబరు 3వ తేదీన ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కలెక్టర్ కూడా వస్తారని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ప్రజల నుంచి వచ్చిన వినతులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అధికారులు చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతు శశిభూషణరావు, ఏవో లోపింటి త్రినాద్, ఈవోపీఆర్‌డీ గొబ్బూరు విజయభాస్కర్, ఏఈ సూర్యనారాయణ, ఏపీఎం మీసాల చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

రిఫర్ కేసుల వివరాలు సేకరించండి

తెర్లాం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఉన్నత వైద్యానికి రిఫర్ చేసిన కేసుల(రోగులు) వివరాలు సేకరించాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన మండలంలోని అన్ని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించామని, శిబిరాలకు హాజరైన రోగుల్లో ఉన్నత వైద్యసేవలు పొందేందుకు మండలం నుంచి 208 మందిని సీహెచ్‌సీలు, ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు పంపించడం జరిగిందన్నారు. ఉన్నత వైద్యం కోసం పంపించిన రోగుల వివరాలను పంచాయతీ కార్యదర్శులు సేకరించి, ఎంపీడీవో కార్యాలయానికి అందజేయాలన్నారు. మండలంలో జరగనున్న ఉపాధి పనుల సామాజిక తనిఖీకి పంచాయతీ కార్యదర్శులంతా సహకరించాలని కోరారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన పథకాలకు సంబంధించి, ఈకేవైసీ సకాలంలో పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ నీలిమ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించాలి


సచివాలయ ఏఎన్‌ఎంలకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: మున్సిపాలిటీలో నవంబరు 7, 14, 21వ తేదీల్లో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సూచించారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని సచివాలయ ఏఎన్‌ఎంలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ విజయవంతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమానికి ముందు ఇంటింటికీ వెళ్లి, రోగుల వివరాలను సేకరించి, వారికి అందే సేవలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని ప్రాంతాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ కుమార్ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ సమస్య ఉంటుందని, డోలపేట చెక్‌పోస్ట్, డోలపేట, బుచ్చెంపేట, పొనుగుటివలస ప్రాంతాల ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

1న ఆరికతోటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రామభద్రపురం: మండలంలోని ఆరికతోటలో నవంబరు 1వ తేదీన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమామణి ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని కోరారు.

రెడ్‌క్రాస్ సేవలు విస్తృతం చేయాలి

రాజాం సిటీ: రెడ్‌క్రాస్ ద్వారా అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని యూత్ రెడ్‌క్రాస్ యూనిట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కేవీఎస్ ప్రసాద్ అన్నారు. స్థానిక జీఎంఆర్ ఐటీ యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన రెడ్‌క్రాస్ ద్వారా అందించిన సేవలను కొనియాడారు. యూత్ రెడ్‌క్రాస్ సభ్యులు కూడా సమాజ సేవలో మమేకం కావాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యుడు పెంకి చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.18 లక్షలతో రక్షిత మంచినీటి పథకం

రాజాం: మండలంలో సీఎస్‌ఆర్ పురంలో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం చేపడుతున్నారు. జల్ జీవన్ మిషన్ పనుల్లో భాగంగా రూ.18 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ట్యాంకు ద్వారా గ్రామంలోని ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నామని ఎంపీపీ లావేటి సులోచన తెలిపారు. సంక్రాంతి పండగలోపు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వాటర్ ట్యాంకు ప్రారంభం..

సంతకవిటి: మండలంలోని మండవకురిటి గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకును సర్పంచ్ బత్తుల జ్యోతీశ్వరరావు సోమవారం ప్రారంభించారు. గ్రామస్తుల తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ఈ ట్యాంకును ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ తెలిపారు.

ఈ–క్రాప్ నమోదు జాబితా ప్రదర్శన

రేగిడి: మండలంలోని తునివాడ గ్రామ సచివాలయంలో ఈ–క్రాప్ నమోదు చేసుకున్న జాబితాను సోమవారం ప్రదర్శించారు. ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతీ రైతు తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో సరిచూసుకోవాలన్నారు. పేర్లు లేని వారు తమకు తెలియజేయాలన్నారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి

- జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎంపీడీవో శంబంగి రామకృష్ణ


తెర్లాం: స్పందన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి వచ్చిన ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి పలు గ్రామాల నుంచి ప్రజలు వచ్చి, వారి సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు సమర్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలు అందజేసిన వినతుల్లో పేర్కొన్న సమస్యలను మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి, పరిశీలించాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని, అర్జీదారు సమస్య ఎందుకు పరిష్కారం కాలేదోనన్న విషయం కూడా అర్జీదారుకు తెలియజేయాలన్నారు. సమస్యలు పరిష్కరించి, ఫిర్యాదుదారుల ముఖాల్లో సంతోషం చూడాలన్నారు.

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా వెలుగులోకి వస్తున్న ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించాలని, అర్జీదారుల సమస్యలు సకాలంలో పరిష్కరించి, వారి ముఖాల్లో చిరునవ్వును చూడాలన్నారు. ప్రధానంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల సమస్యలను తొలుత పరిష్కరించాలన్నారు. ఏ గ్రామంలోనూ తాగునీరు, రోడ్లు, విద్యుత్, పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లోని పారిశుద్ధ్య కార్మికులకు నెలనెలా జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు పాల్గొన్నారు.

'స్పందన' కరువు..

మెంటాడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి అధికారుల నుంచి స్పందన కరువైంది. విద్య, హౌసింగ్, ఉపాధి శాఖల అధికారులు తప్ప మరే ఇతర శాఖల నుంచి అధికారులు రాకపోవడంపై ఎంపీడీవో తివిక్రమ్ మండిపడ్డారు. 19 సచివాలయాలకు సంబంధించి, ఒక్క కార్యదర్శి కూడా హాజరు కాకపోవడంతో వారికి ఎంపీడీవో ఫోన్ చేసి, వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమానికి హాజరుకాని అధికారుల నుంచి వివరణ తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మోహనరావు, హౌసింగ్ ఏఈ డేవిడ్, ఏపీఎం అప్పాజీ పాల్గొన్నారు.

మృతుల ఓట్లు తొలగించాలి


బాడంగి: బీఎల్‌వోలతో సమావేశమైన తహసీల్దారు అజు రఫీజాన్

రామభద్రపురం: ఓటర్ల జాబితా నుంచి మరణించిన వారి ఓట్లు తొలగించాలని తహసీల్దారు ఎ.సులోచనరాణి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడుతూ 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు. నవంబరు 4, 5వ తేదీలతో పాటు డిసెంబరు 2, 3వ తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఓటరు జాబితాలతో పోలింగ్ కేంద్రాల వద్ద అందరికీ అందుబాటులో ఉండాలని, పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లు తమ పేర్లు ఉన్నాయా లేవా అనే విషయాన్ని పరిశీలించుకుని, పేర్లు లేకపోతే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటుహక్కు కోసం ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఓటర్ల నమోదుతో పాటు అభ్యంతరాల స్వీకరణకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. డిసెంబరు 26వ తేదీలోగా అభ్యంతరాలను పరిష్కరిస్తామన్నారు.

బాడంగి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌వోలతో తహసీల్దారు అజు రఫీజాన్ సోమవారం సమావేశమై, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించేందుకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా వచ్చినందున దాని ఆధారంగా గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి, వారి ఓట్లు ఉన్నాయా లేదా అనే విషయం పరిశీలించాలని, ఒకవేళ ఓటరు పేరు లేకపోతే చేర్చాలన్నారు. కొత్తగా ఓటర్లుగా నమోదయ్యేందుకు 18 ఏళ్లు నిండిన యువతీయువకులతో దరఖాస్తు చేయించాలన్నారు. ఓటర్ల తుది జాబితా 2024 జనవరి 5వ తేదీ విడుదలవుతుందన్నారు. సమావేశంలో హెచ్‌డీటీ చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద ఘటన బాధాకరం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


బొబ్బిలి: మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో రైలు దుర్ఘటనలో మరణించిన వారికి సంతాపం ప్రకటిస్తున్న సభ్యులు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: కంటకాపల్లి వద్ద జరిగిన రైలు ప్రమాద ఘటన చాలా బాధాకరమని, మృతుల కుటుంబాలతో పాటు క్షతగాత్రులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన రైలు దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, సహాయక చర్యలను ముమ్మరం చేశారన్నారు. సోమవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రతీ ఒక్కరి దగ్గరికి వెళ్లి, పరామర్శించారన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారన్నారు.

నక్కకి.. నాగలోకానికి ఉన్న తేడా..

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో చంద్రబాబుకు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి నక్కకి నాగలోకానికి ఉన్న తేడా ఉందన్నారు. గతంలో టీడీపీ హయాంలో మంత్రి వర్గంలో ఉన్న ఇక్కడి రాజులు నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. టీడీపీ నేతలు ఎల్లో మీడియా వద్ద ఏదో చేశామని చెప్పడం కాదని, ఎక్కడ ఏం అభివృద్ధి చేశారో చూపించాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీ వెంటే ఉండడంతో టీడీపీ నాయకుల్లో భయం పట్టుకుందన్నారు. బొబ్బిలిలో టీడీపీ తరఫున బీసీల్లో ఏ నాయకుడైనా పోటీ చేస్తానంటే రాజుల్లో వణుకుపుడుతోందన్నారు. బీసీలను పోటీ చేయించే దమ్ము కూడా టీడీపీకి లేదన్నారు. మళ్లీ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, జగనన్ననే మరోసారి సీఎంను చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్షుంనాయుడు, పార్టీ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంతాపం..

బొబ్బిలి: పట్టణంలో సోమవారం జరిగిన బొబ్బిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కంటకాపల్లి వద్ద జరిగిన రైలు ప్రమాద ఘటనలో మృతి చెందిన వారికి సంతాపం ప్రకటిస్తూ కౌన్సిల్ సభ్యులు రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయని, వాటిని తొలగించాలని కోరినా చర్యలు తీసుకోలేదని తెలపగా, టీపీవో వరప్రసాద్ స్పందించి, అక్కడి అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, కౌన్సిలర్ పాలవలస ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి జారిపడి వ్యక్తి మృతి


మృతి చెందిన మంగన్న

రాజాం సిటీ: భవనంపై నుంచి జారిపడి జడ్డు మంగన్న(45) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాద ఘటన రాజాంలో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. మండల పరిధిలోని పొగిరి గ్రామానికి చెంది మంగన్న మిల్లర్ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాజాం పట్టణంలోని వాసవీనగర్‌లో జరుగుతున్న ఓ భవన నిర్మాణం రెండో అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి, ఇంతవరకు సమాచారం లేదని, ఫిర్యాదు అందితే కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ వి.బి.రామకృష్ణ తెలిపారు.

సక్రమంగా విధులు నిర్వర్తించాలి

బాడంగి: విధులు సక్రమంగా నిర్వర్తించాలని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు ఎనర్జీ అసిస్టెంట్లకు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎనర్జీ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మండలంలోని ఎనర్జీ అసిస్టెంట్లు సరిగా పనిచేయడం లేదని, వీధి లైట్లు పోయినా బాగు చేయడం లేదని తలెత్తిన ఆరోపణలపై జెడ్పీటీసీ ఎనర్జీ అసిస్టెంట్లను నిలదీశారు. వారు మాట్లాడుతూ ఐదు పంచాయతీల్లో ఎనర్జీ అసిస్టెంట్లు లేరని, తమకు కూడా సహాయకులను ఇవ్వాలని కోరారు. అలాగే క్లాప్‌మిత్రలకు చెల్లించాల్సిన బకాయి వేతనాలను తక్షణమే చెల్లించే చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు జెడ్పీటీసీ సూచించారు. నవంబరు 15వ తేదీలోగా వారికి బకాయి పడిన మొత్తాన్ని చెల్లించాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ, విద్యుత్ శాఖ ఏఈ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరిపంట పరిశీలన


వరిచేను కుళ్లకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న శాస్త్రవేత్త శ్రీనివాసరావు

మెంటాడ: మండలంలోని కొంపంగి గ్రామంలో రైతులు పండిస్తున్న వరిపంటను డాట్ సైంటిస్ట్ ఎం.ఎం.వి.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కుళ్లిన వరిదుబ్బును చూసి, పొట్టదశకు వచ్చేవరకు పంటకు ఎరువులు వేయడం సరైన పద్ధతి కాదని, మోతాదుకు మించి ఎరువులు వేస్తే పంట విషతుల్యం కావడమే కాకుండా దిగుబడి కూడా అంతగా రాదన్నారు. ఎక్కువగా ఎరువులు వేస్తే వరిదుబ్బు(వేర్లు) కుళ్లిపోయి ధాన్యం పాడయ్యే అవకాశం ఉంటుందన్నారు. వరిచేను పూర్తిగా పండిన తర్వాతే కోతలు కోయాలని, కోత అనంతరం ధాన్యం కుళ్లకుండా వరిచేను కుప్పలు ఎలా వేసుకోవాలో తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల వ్యవసాయాధికారి గోకుల్‌కృష్ణ తదితరులు ఉన్నారు.

బొబ్బిలి: మండలంలోని నారాయణప్పవలస, కాశిందొరవలస గ్రామాల్లోని వరిపంటను వ్యవసాయ పరిశోధనా కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు ఎం.వి.వి.శ్రీనివాసరావు, అబ్దుల్ సలాం సోమవారం పరిశీలించారు. అనంతరం వారు వరిచేలను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం పంటలో ఆకుముడత, తాటాకు తెగుళ్ల ఉన్నట్లు గుర్తించిన వారు వాటి నివారణకు పలు మందులను రైతులకు సూచించారు. వారి వెంట వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్ తదితరులు పాల్గొన్నారు.